క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ



బసవయ్యను పరామర్శిస్తున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులను నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు శనివారం పరామర్శించారు. వార్డు నాయకులు సుబ్బయ్య, బసవయ్య, అప్పలనాయుడు, ఆదినారాయణ కొన్నాళ్లుగా అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వారందరినీ అప్పారావు పరామర్శించి ప్రస్తుతం వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వైదా నారాయణరావు, స్థానిక నాయకులు పతివాడ వెంకటలక్ష్మి, కృష్ణ, రవీంద్ర, తులసి, శశికుమార శ్రీహరి, నాయుడు, రవి కుమార్, సత్యవతి, కుమారి, వీరమ్మ తదితరులు పరామర్శించారు.

తెలుగు సాహిత్య సముద్రుడు ఆరుద్ర



ఆరుద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు

మద్దిలపాలెం: ఆరుద్ర శతజయంతి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగంలో ఆరుద్ర సాహిత్య సమాలోచన సభ శనివారం నిర్వహించారు. విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు పాల్గొని ఆరుద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్య సముద్రుడు ఆరుద్ర అని కొనియాడారు. ఏయూ, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణతో, డిలీట్ పట్టా ఇచ్చి సన్మానించాయని గుర్తు చేశారు. జర్రా అప్పారావు మాట్లాడుతూ ఆరుద్ర గొప్పతనాన్ని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, స్నేహలత, ఉదయలక్ష్మి, వంశీ, చందు, నితిన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ



లీలాసుందరినగర్‌లో మండపం వద్ద దీపారాధన

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి లీలాసుందరి నగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి దీపారాధన చేశారు. వినాయకుడు, శివుడు రూపంలో దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా మండపం వద్ద ఆదివారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తామని గ్రామాధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు తెలిపారు. భక్తులు హోమంలో పాల్గొని విఘ్నేశ్వరుడిని దర్శించుకోవాలని కోరారు.

మద్దిలపాలెం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివాజీపాలెం ఏపీఎస్‌జీవోకాలనీ లక్ష్మీనగర్‌లో వండర్‌బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో శనివారం ఐస్ శివలింగాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ఎదురుగా దీపాలంకరణ చేశారు. ఐస్ శివలింగాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగావకాశాలు

దాబాగార్డెన్స్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ప్రొడక్షన్ ఎక్విప్‌మెంట్ ఆపరేటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు ఇంటర్మీడియట్, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మూడు నెలల ఉచిత శిక్షణతోపాటు యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు నేరుగా తమ సంస్థను లేదా 93816 67986, 72079 53919 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మన్యం రైతులపై రవాణా భారం



ఎంవీపీ రైతు బజార్‌లో కుళ్లిపోయిన మన్యం రైతుల పనస కాయలు



గతంలో రైతులకు సేవలు అందించిన ఆర్టీసీ కార్గో సర్వీసు

- రైతుబజార్లకు వ్యవసాయ ఉత్పత్తుల తరలింపులో ఇక్కట్లు
- గతంలో ఆర్టీసీ కార్గో ద్వారా సేవలు అందించిన మార్కెటింగ్ శాఖ
- కొన్నేళ్లుగా ఆ సేవలు నిలిచిపోవడంతో ట్రాన్స్‌పోర్ట్ ఖర్చుల భారం
- నరకులు పాడవడంతో ఆర్థికంగా నష్టపోతున్న మన్యం రైతులు
- ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఆదుకోవాలని వేడుకోలు

ఎంవీపీ కాలనీ:

గ్రామీణ వ్యవసాయ **ఉత్పత్తుల రవాణా** మన్యం రైతులకు పెను భారం**గా మారింది. వం**దల మంది రైతులు విశాఖ న**గరంలోని రైతు బజా**ర్లలో దశాబ్దాలుగా వారి ఉత్ప**త్తులను విక్రయించు**కుంటున్న విషయం తెలిసిం**దే. మన్యంలోని** పాడేరు, అరకు నియోజక**వర్గాల పరిధిలోని** గ్రామీణ ప్రాంతాల్లో పండించే **వ్యవసాయ ఉత్ప**త్తులను వారు నగరంలోని రైతు **బజార్లకు తరలించి** విక్రయించుకుంటున్నారు. వారి **జీవన ప్రమాణాల** మెరుగు కోసం రాష్ట్ర ప్రభుత్వం **మార్కెటింగ్ శాఖ** ద్వారా ఈ అవకాశాన్ని కల్పించిం**ది. అయితే వారి** ఉత్పత్తులను నగరానికి తరలిం**చడంలో అనేక సవా**ళ్లను ఎదుర్కొంటున్నట్లు రైతులు **వాపోతున్నారు.** లాభాల కంటే రవాణా ఖర్చుల **భారమే అధికమం**టూ వాపోతున్నారు. ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

గతంలో ఆర్టీసీ కార్గో సేవలు

నగరంలోని రైతు బజార్లలో 200 మందికి పైగా మన్యం రైతులు వారి ఉత్పత్తులను విక్రయించుకుంటున్నారు. ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, మధురవాడ తదితర రైతు బజార్లలో వారు స్టాల్స్ కలిగి ఉన్నారు. మన్యంలోని పాడేరు, అరకు గ్రామీణ ప్రాంతాలు విశాఖ నగరానికి 100 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్నాయి. దీంతో రైతులు వారి ఉత్పత్తులను నగరానికి తరలించే క్రమంలో **విక్రయాల్లో ప్రధాన భాగం రవాణా ఖర్చులకే కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారం కోసం గతంలో మార్కెటింగ్ శాఖ ఆర్టీసీ కార్గో సర్వీస్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. వారంలో రెండు రోజులు మన్యం రైతులకు ఈ సేవలు అందుబాటులో ఉండేవి. దీంతో తక్కువ ఖర్చుతో వారంతా కూరగాయలతో పాటు పనస, సీతాఫలం, పైనాపిల్ వంటి పలు రకాలను వందల బస్తాలుగా రైతు బజార్‌కు తరలిం**చి విక్రయించేవారు. అయితే కోవిడ్ కారణంగా ఈ **సేవలు నిలిచిపోవడంతో రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికీ మార్కెటింగ్ శాఖ కార్గో సేవలను పునఃప్రారంభించకపోవడంతో రైతులకు రవాణా ఖర్చులు భారంగా మారాయి. దీంతో ప్రైవేట్ వాహనాల్లో భారీ రవాణా ఖర్చులు భరించి ఉత్పత్తులను రైతు బజార్లకు తీసుకురావడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి కార్గో సర్వీస్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని** కోరుతున్నారు.

కార్గో సేవలు పునరుద్ధరించాలి



గతంలో కార్గో సేవలు అందుబాటులో ఉండటంతో రవాణా ఖర్చుల భారం తక్కువగా ఉండేది. 2019 తర్వాత కోవిడ్ ప్రభావం, రైతుల రాకపోకలు తగ్గడంతో ఈ సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం నగరంలోని రైతు బజార్లకు మన్యం ప్రాంతం నుంచి 200 మందికి పైగా రైతులు వారి ఉత్పత్తులను తీసుకొస్తున్నారు. ఎంవీపీ రైతు బజార్‌లోనే 70 మంది రైతులం ఉన్నాం. వారానికి రెండు సార్లు ప్రైవేట్ వాహనాల్లో వ్యవసాయ ఉత్పత్తులు తీసుకురావడంతో రవాణా ఖర్చులు భారంగా మారాయి. కార్గో సేవలను పునరుద్ధరించి ఆర్థిక భారం తగ్గించాలి.

– చైతన్య, మన్యం రైతు



క్యాబేజీని ప్రైవేట్ వాహనంలో లోడ్ చేస్తున్న మన్యం రైతులు

రెండు విధాలా నష్టపోతున్నాం



సరకు రవాణాకు అధిక ఖర్చు అవుతుండడంతో ఒకేసారి ఎక్కువ సరకును మన్యం నుంచి నగరంలోని రైతుబజార్లకు తీసుకొస్తున్నాం. దీంతో ఒక్కో వారం సరకు ఎక్కువ అమ్ముడు కాకపోవడంతో పనస, సీతాఫలం, క్యాబేజీ వంటి ఉత్పత్తులు కుళ్లిపోతున్నాయి. దీంతో అటు రవాణా ఖర్చుల భారం, ఇటు ఉత్పత్తులు కుళ్లిపోవడంతో రెండు విధాలా ఆర్థికంగా నష్టపోతున్నాం. కార్గో సేవలను తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తీసుకొస్తే మన్యం రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– భైలు, మన్యం రైతు

ఏపీ స్టడీ సర్కిల్‌ను బలోపేతం చేయండి

విశాఖ సిటీ: రుషికొండలో ఉన్న ఏపీ స్టడీ సర్కిల్‌ను బలోపేతం చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన, ఏపీ స్టడీ సర్కిల్ ఫోరం ప్రతినిధులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని కోరారు. శనివారం ప్రభుత్వ అతిథి గృహంలో ఆయా సంఘాల ప్రతినిధులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి సివిల్స్, గ్రూప్ – 1 పోటీ పరీక్షల్లో శిక్షణ కోసం నోటిఫికేషన్ వెంటనే జారీ చేయాలని కోరారు. స్టడీ సర్కిల్‌కు శాశ్వత ప్రాతిపదికన రెగ్యులర్ డైరెక్టర్‌ను, టీచింగ్ ఫ్యాకల్టీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ స్టడీ సర్కిల్ స్టూడెంట్ ఫోరం అధ్యక్షుడు కొల్లు ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఏపీ స్టడీ సర్కిల్ సక్రమ నిర్వహణకు, అభివృద్ధికి అన్ని రంగాలను కలుపుకుని మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు అల్లాడి వీరభద్రరావు, రామకష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దోలా బాల వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష

ఎంవీపీ కాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులతో రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ – 9లోని సంక్షేమ భవన్‌లో గల ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఈ సమావేశం నిర్వహించారు. ముందుగా కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించిన విజయ్‌కుమార్‌కు ఈడీ పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. అనంతరం సమీక్షలో పాల్గొన్న విజయ్‌కుమార్ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న వివిధ రుణాలపై చర్చించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, పౌల్ట్రీ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాల అభివృద్ధిపై ఆరా తీశారు. ఎస్సీ అభ్యర్థులకు ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ దరఖాస్తుల ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల అమలుకు తీసుకుంటున్న చర్యలు, రికవరీ వంటి అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈడీ సత్యపద్మతో పాటు పలువురు కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పెదపూడి విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈడీ సత్యపద్మ

గణపతి మండపంలో పూజలు

మద్దిలపాలెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం బజారులో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పిలక మధుసూదన రెడ్డి పాల్గొన్నారు.



మండపంలో పూజలు చేస్తున్న మొల్లి అప్పారావు, తదితరులు

అబ్బురపరిచిన కథక్ నృత్యోత్సవం

మద్దిలపాలెం: సాంస్కృత కథక్ విద్యాలయ వార్షికోత్సవం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురు హరిరామ్మూర్తి, కన్నం నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గురు హరిరామ్మూర్తి మాట్లాడుతూ సంప్రదాయ నృత్యాలకు జీవం పోస్తున్న సాంస్కృత కథక్ విద్యాలయ కృషి అభినందనీయమన్నారు. విద్యతోపాటు, నృత్యంలో రాణించి మన సంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు. గురు డాక్టర్ బి.క్రిత కరుణి విశాఖ నగరంలో కథక్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం వారా ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణారావు మాట్లాడుతూ నగరంలో గత ఏడేళ్లలో 700 మంది కథక్ నృత్యం నేర్చుకునేందుకు క్రిత కరుణి ఎంతో శ్రమించారన్నారు. డాక్టర్ వీఏఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో కళలకు ప్రోత్సాహం తక్కువగా ఉందని, ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం 27 మంది కళాకారులు 12 నృత్య ప్రదర్శనలు చేసి అందరినీ అబ్బురపరిచారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

బీచ్ కబడ్డీ పోటీల విజేత చంద్రంపాలెం

విశాఖ స్పోర్ట్స్: సాగరతీరంలో బీచ్ కబడ్డీ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. గోపాలపట్నం ఎస్వీ ఎల్ఎన్‌జెడ్ హైస్కూల్ జట్లు రన్నరప్ సాధించాయి. విజేతలకు ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడుతున్న బెంగాల్ వారియర్స్ జట్టు సభ్యులు ట్రోఫీలను అందజేశారు. ఆ జట్టు కెప్టెన్ దేవంక్ దలాల్, చీఫ్ కోచ్ నవీన్ కుమార్ పాల్గొని.. ఆటను ఎలా మెరుగుపరుచుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. పోర్టు స్టేడియంలో ఆదివారం జరిగే తమ మ్యాచ్‌ను వీక్షించేందుకు వారికి ఆహ్వానం పలికారు.



బీచ్ కబడ్డీ విజేతలతో వారియర్స్ జట్టు సభ్యులు

కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించాలి

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: మోసాలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్న కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం జీవీఎంసీ 16వ వార్డు కె.ఆర్.ఎం.కాలనీలో పార్టీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరించి కరపత్రాలు అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ మేనిఫెస్టోలో చెప్పిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలంతా తెలుసుకుని, ఎన్నికల సమయంలో బుద్ధి చెప్పి గద్దె దించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ కొంగరాని రాంబాబు, మీసాల ప్రదీప్, మధుసూధన రెడ్డి, వేములవలస అప్పారావు, కన్నారావు, సంధ్య, జగదీశ్వరి, శశికళ, సరగడ వేణు గోపాల్ రెడ్డి, బొడ్డేటి వేణుగోపాల్, బమ్మిడి జోగారావు, నాయుడు కోటి, బి.సత్యనారాయణ, బాలకృష్ణ, రాజమోహన్ రెడ్డి, కృష్ణ, నక్కనాయుడు, సత్యనారాయణ, సుబ్బారా వు, రాము, భాష, భాస్కర్, సింహాచలం, చిట్టిబాబు పాల్గొన్నారు.



జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

యూత్ ఫెస్ట్‌లో ప్రతిభ



తృతీయ స్థానం సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా జూనియర్ కళాశాలలో నిర్వహించిన యూత్‌ఫెస్ట్ – 2025లో రెడ్‌రిబ్బన్‌పై జరిగిన పోటీలో కృష్ణా కళాశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకుల బృందం శనివారం అభినందించారు.

ప్రమాదకరంగా బ్యానర్లు



నగరంలో మూడు రోజుల పాటు జరుగుతున్న వివిధ కార్యక్రమాల కోసం కూటమికి చెందిన నేతలు, మంత్రులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో నగరాన్ని పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో నింపేశారు. బీచ్‌రోడ్డులోని డివైడర్లపై ఉన్న విద్యుత్ స్తంభాలకు కూడా వీటిని కట్టారు. సముద్ర తీరంలో గాలి ఉధృతికి ఈ ఫ్లెక్సీలు చిరిగి.. వాహనదారులపై పడుతూ ప్రమాదకరంగా మారాయి. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి.. ప్రమాదకరంగా ఉన్న ఈ ఫ్లెక్సీలను తొలగించి, ప్రజలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది.

సమ్మిళిత విద్యను చేరువ చేయాలి

మద్దిలపాలెం: సమ్మిళిత విద్య చేరువ చేసేందుకు కృషి చేయాలని రీహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యురాలు, అలగప్ప యూనివర్సిటీ స్పెషల్ ఎడ్యుకేషన్ రిపోలిటిషన్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య సుజాత మాలిని సూచించారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులను ఉద్దేశించి శనివారం ఆమె వర్చువల్‌గా ప్రసంగించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్‌లు ఏర్పాటు కావాలని, కరికులంలో సరళత ఉండాలని ఆమె సూచించారు. నూతన విద్యా విధానం అందించిన సూచనలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి వారికి అనువైన బోధన, అభ్యసన విధానాలు అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకుంటూ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించిన విధానాన్ని వివరించారు. ప్రత్యేక విద్యను బోధించే వారు నిరంతరం నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ జాతీయ విద్య విధానం అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. విభిన్న ప్రతిభావంతులను సాధారణ వ్యక్తులతో సమానంగా తీర్చిదిద్దాలన్నారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ రీహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో మూడు రోజులపాటు కంటిన్యూయింగ్ రీహేబిలిటేషన్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆచార్య డి.నగరాజ కుమారి, డాక్టర్ ప్రకాష్ రచించిన స్పెషల్ ఎడ్యుకేషన్ అండ్ మల్టిపుల్ డిజేబిలిటీస్ పుస్తకాన్ని వీసీ రాజశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్స్‌ను సత్కరించారు. కార్య క్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజ కుమార్, డాక్టర్ ఆలీ, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాష్, డాక్టర్ ప్రవీణ దేవి, డాక్టర్ రాము పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

బాధితులకు బాసటగా న్యాయ సేవాధికార సంస్థ

మహారాణిపేట: లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం, ఆర్థిక సాయం, న్యాయ సహాయం, పునరావాస చర్యల కోసం పనిచేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ పలు చట్టాల గురించి వివరించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.రామారావు, డ్వాక్రా సంఘాల సమన్వయ అధికారి కె.వి.రామలక్ష్మి, ఈవో బి.సురేష్ కుమార్, జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, ఎస్సీ, ఎస్టీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

ఆటవిడుపు



నిత్యం పాఠశాలలకే పరిమితమయ్యే చిన్నారులు.. శనివారం కాసేపు సేదతీరారు. బీచ్‌రోడ్డులోని డ్రాగన్ పార్క్ పచ్చిక బయళ్లపైకి చేరుకొని ఆటపాటలతో సందడి చేశారు. స్నేహితులతో కలిసి ఆడుతూ, చల్లని గాలిని ఆస్వాదిస్తూ కేరింతలు కొట్టారు. వారి అల్లరితో ఆ ప్రాంతమంతా ఆహ్లాదకరంగా మారింది.

